

రైతుల రాస్తారోకో

వెంటనే ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ గోపాల్‌పేటలో రైతులు రాస్తారోకో చేశారు.

- 11లో ▸



వసతులు కల్పించాలి

కొనుగోలు కేంద్రాలలో అవసరమైన వసతులు కల్పించాలని డీఆర్డీవో సురేందర్ నిర్వాహకులకు సూచించారు.

- 11లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.4/17.1

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

కొనుగోళ్లు ఎప్పుడో?

సన్నరకం ధాన్యానికి సంబంధించి సీఎంఆర్ విషయంలో చిక్కుముడి ఏర్పడింది. ప్రభుత్వం క్వింటాలు సన్నవడ్లకు 67 కిలోల బియ్యం ఇవ్వాలని సూచిస్తుండగా.. మరాడిస్తే 58 కిలోల బియ్యమే వస్తాయని మిల్లర్లు పేర్కొంటున్నారు. దీంతో ధాన్యం సేకరణ విషయంలో సందిగ్ధత కొనసాగుతుండడంతో కాంటాలు ఆలస్యం అవుతున్నాయి.

ధాన్యం సేకరణపై సందిగ్ధత

- సీఎంఆర్ విషయంలో చిక్కుముడి
- క్వింటాలు సన్న వడ్లకు 67 కిలోల బియ్యం ఇవ్వాలంటున్న ప్రభుత్వం
- వడ్లను మరాడిస్తే 58 కిలోల బియ్యమే వస్తుందంటున్న మిల్లర్లు
- సర్కారునుంచి స్పష్టత లేక ప్రారంభం కాని తూకాలు



కామారెడ్డి క్రైం : జిల్లాలో 163 రైస్ మిల్లులు ఉన్నాయి. ఇందులో 35 బాయిల్డ్, 128 రా రైస్ మిల్లులు. జిల్లాలో ప్రధాన పంట వరి. ప్రతి సీజన్‌లో కనీసం 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుంది. ఈసారి కూడా 5.50 లక్షల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి అనుగుణంగా జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

సన్నాలతోనే సమస్య..

అధికారంలోకి వస్తే వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. ఆ హామీని ఈ సీజన్‌నుంచి అమలు చేస్తామని సర్కారు ప్రకటించింది. అయితే సన్నరకం వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని పేర్కొంది. వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందే సర్కార్ బోనస్ ప్రకటించడంతో జిల్లాలో చాలామంది రైతులు సన్నరకం వడ్లను సాగు చేశారు. దాదాపు సగం సన్నరకాలే సాగయినట్లు తెలుస్తోంది. అయితే సన్నరకం వడ్లే సమస్యగా మారింది. సన్న రకం వడ్లను మిల్లింగ్ చేస్తే నూక ఎక్కువగా ఉంటుందని, 58 కిలోల బియ్యం మాత్రమే వస్తాయని రైస్‌మిల్లర్లు పేర్కొంటున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం సన్నవయినా, దొడ్డువయినా 67 కిలోల బియ్యం సీఎంఆర్‌గా అందించాలని ఆదేశించింది. ఈ వ్యవహారంపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి.

గోదాములేవి?

డీఫాల్టర్‌లుగా ఉన్న మిల్లర్లుకు ధాన్యం ఇవ్వకూడదనే ఆలోచనతో కొనుగోలు కేంద్రాల నుంచి సేకరించిన వడ్లను ముందుగా గోదాముల్లో నిల్వ చేయాలని సర్కారు నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేయడానికి సరిపడా గోదాములు జిల్లాలో అందుబాటులో లేవు. జిల్లాలో 5.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలన్న లక్ష్యంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అయితే ఉప్పల్‌వాయి వద్ద ఇటీవల నిర్మించిన 80 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం మినహా అద్దెకు తీసుకునేందుకు ప్రైవేటు గోదాములు కూడా లేవు. ఈ నేపథ్యంలో సేకరించిన వడ్లను నిల్వ చేయడం జిల్లాలో అసాధ్యమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ విషయంలో సర్కారు ఏ నిర్ణయం తీసుకుంటుందోనన్న అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మిల్లులకా.. గోదాములకా?

జిల్లాలో కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్) విషయంలో రైస్‌మిల్లర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. 49 మంది మిల్లర్లు గతంలో సీఎంఆర్‌ను సకాలంలో అందించక డీఫాల్టర్‌లుగా ఉన్నారు. వారంతా 2022–23, 2023–24 సీజన్‌లకు సంబంధించి కొనుగోలు కేంద్రాల నుంచి వడ్లు తీసుకుని బియ్యం రూపంలో తిరిగి ఇవ్వని వారు.. కొందరి నుంచి తక్కువ మొత్తంలో సీఎంఆర్ రాగా.. మరికొందరి నుంచి పెద్ద మొత్తంలో బియ్యం రావాల్సి ఉంది. డీఫాల్ట్ మిల్లర్లు బియ్యం తిరిగి ఇవ్వడం కోసం ప్రభుత్వం చాలాసార్లు గడువు ఇచ్చింది. లేదంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అయినా మిల్లర్లనుంచి స్పందన లేదు. నలుగురు మిల్లర్లు మాత్రమే ఇటీవల బియ్యానికి బదులుగా డబ్బులు చెల్లించి క్లియర్ చేసుకున్నట్లు తెలిసింది. చాలామంది మిల్లర్లు ఇంకా డీఫాల్టర్‌లుగా ఉన్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని ఏం చేయాలన్న అంశంపై సర్కారు వద్ద స్పష్టత కరువయ్యింది. కొనుగోలు కేంద్రాల నుంచి నేరుగా మిల్లులకు తరలించాలా లేక గోదాములకు పంపించాలా అన్న విషయమై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అందుకే అన్ని చోట్ల కొనుగోళ్లకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినా.. ధాన్యం తూకాలు ప్రారంభించలేదని తెలుస్తోంది.

న్యూస్‌రీల్

'కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి'



తాడ్వాయి: కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. తాడ్వాయి మండల పరిషత్‌లో శుక్రవారం అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే కోసం మండలంలో 72 మంది ఎన్యుమరేటర్లను నియమించామన్నారు. ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాలన్నారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి రాజారాం, ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ, తహసీల్దార్ రహీమొద్దీన్, ఎంపీవో సవితా రెడ్డి, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఇబ్బందులు కలగకుండా చూస్తాం'



రామారెడ్డి: హాస్టళ్లలోని విద్యార్థులకు చలికాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రజిత పేర్కొన్నారు. శుక్రవారం ఉప్పల్‌వాయిలోని సంక్షేమ హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు ఉన్నాయన్నారు. సమస్యపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామని తెలిపారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఆమె వెంట సహాయ సాంఘిక సంక్షేమ అధికారి వెంకటేశ్, వార్డెన్ నాగరాజ్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ సంగెం వెంకటేశ్ తెలిపారు. కాకతీయనగర్ కాలనీలో ఉన్న 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నేపథ్యంలో రాధాకృష్ణ లాడ్జి, జన్మభూమి రోడ్డు, కాకతీయనగర్ కాలనీ, ఎన్జీవోస్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కామారెడ్డికి కుడా!

- మూడు బల్దియాలు, 460 గ్రామాలతో ఏర్పాటు
- ఉత్తర్వులు జారీ చేసిన సర్కారు



కామారెడ్డి టౌన్: జిల్లా అభివృద్ధి కోసం ప్రభుత్వం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) ఏర్పాటు చేస్తూ శుక్రవారం జీవో జారీ చేసింది. దీని పరిధిలో జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి బల్దియాలతోపాటు వాటి చుట్టుపక్కల ఉన్న 460 గ్రామాలను చేర్చారు. సమగ్రమైన ప్రణాళికలో మౌలిక సదుపాయాలు అభివృద్ధికి చేయడానికి 'కుడా' దోహదపడనుంది. రహదారుల అభివృద్ధి, నీటి సరఫరా, ఉపాధి, సమగ్ర మాస్టర్ ప్లాన్, శాటిలైట్ టౌన్‌షిప్‌లాంటి అభివృద్ధి పనులు చేయడం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ లక్ష్యం. కుడా ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ చైర్మన్‌గా కమిటీ..

కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుతో పాటు, కమిటీని నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరి దాన కిషోర్ శుక్రవారం జీవోను విడుదల చేశారు. ఆ జీవో ప్రకారం కమిటీకి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. వైస్ చైర్మన్‌గా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఉంటారు. ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ, డీఎంఏ అధికారి, డీటీసీపీ అధికారులు సభ్యులుగా వ్యవహరిస్తారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, వేదికపై అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి

- 'ధరణి'పై రోజూ సమీక్షిస్తా
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్: నిర్ణీత గడువులోగా పెండింగ్ పనులు పూర్తిచేసి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, సర్వేయర్లు, సర్వే ల్యాండ్ రికార్డ్స్, సంబంధిత కలెక్టరేట్ సెక్షన్ పర్యవేక్షకులతో పలు అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ధరణి, రాష్ట్ర, జిల్లా ప్రజావాణి దరఖాస్తులు, ధ్రువీకరణ పత్రాలు, భూ సంబంధ కేసులు, భూ సేకరణ, మానవ హక్కుల కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ కేసులు, ప్రభుత్వ భూముల సంరక్షణ, ప్రత్యేక ఓటరు నమోదు, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన అంశాలపై తహసీల్దార్లు సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ధరణికి సంబంధించిన అంశాలపై రోజూ రెండు మండలాలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవోలు రంగనాథ్ రావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పశుగణన పకడ్బందీగా చేపట్టాలి



కామారెడ్డి టౌన్: జిల్లాలో పశుగణన సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం తన చాంబర్‌లో సర్వే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సర్వేను విజయవంతం చేయడానికి 113 మంది ఎన్యుమరేటర్స్, 25 మంది సూపర్‌వైజర్‌లను నియమించామన్నారు. జిల్లావ్యాప్తంగా గేదెలు, ఎడ్లు, ఆవులు, మేకలు, గొర్రెలు, కోళ్లు తదితర జంతువులతోపాటు యంత్ర సామగ్రిపైనా సర్వే చేయాలన్నారు. ఎప్పటికప్పుడు సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. రైతులు సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పశు వైద్య, సంవర్ధక శాఖ అధికారి సంజీవ్‌కుమార్, వైద్యులు శ్రీనివాస్, దేవేందర్, నితీష్ పాల్గొన్నారు.

పాలన పట్టాలెక్కిస్తా!



మాట్లాడుతున్న వీసీ యాదగిరిరావు



తెలంగాణ యూనివర్సిటీలో పాలనను క్రమబద్ధీకరిస్తానని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ యాదగిరిరావు స్పష్టం చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో వర్సిటీ పరిపాలనకు సంబంధించి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తానని, అందుకు అనుగుణంగా ముందుకు వెళతానని పేర్కొన్నారు. శుక్రవారం 'సాక్షి' ఇంటర్వ్యూలో వీసీ యాదగిరిరావు పలు అంశాలపై వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే.. - సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

సాక్షి ఇంటర్వ్యూ

ప్రతి అంశం నిశిత పరిశీలన

- క్రమం తప్పకుండా కాన్వొకేషన్ నిర్వహించేలా చర్యలు
- ఆన్సర్ బుక్స్ ఆన్‌లైన్ వ్యాల్యుయేషన్ అక్రమాలలో ప్రక్షాళన
- గత పాలకమండలి తీర్మానాలు క్షుణ్ణంగా పరిశీలించి అమలుకు కృషి
- 2014 నియామకాలకు సంబంధించి కోర్టు, ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుకు వెళ్తాం
- 'సాక్షి' ముఖాముఖిలో తెయూ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు

ప్రశ్న : న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) సాధింపు?

జవాబు : న్యాక్ సాధించేందుకు క్రమపద్ధతి ప్రకారం ముందుకు వెళతాం. ఏక్యూఏఆర్ (యాన్యువల్ క్వాలిటీ అస్యూరెన్స్ రిపోర్టు), ఐక్యూసీ (ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్), ఎస్ఎస్ఆర్ (సెల్ఫ్ స్టడీ రిపోర్టు) వీటిన్నింటినీ కచ్చితమైన విధానంలో సబ్మిట్ చేసి న్యాక్ సాధిస్తాం.

■ కీలకమైన కాన్వొకేషన్ నిర్వహణ ?

■ యూనివర్సిటీలో కాన్వొకేషన్ నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిందే. ఇంత కీలకమైన కాన్వొకేషన్ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం పనికిరాదు. గత 18 ఏళ్లలో కేవలం ఒక్కసారి మాత్రమే కాన్వొకేషన్ నిర్వహించిన విషయం తెలిసి ఆశ్చర్యపోయాను. ఇప్పటి నుంచి క్రమం తప్పకుండా కచ్చితంగా కాన్వొకేషన్ నిర్వహించేందుకు తక్షణమే చర్యలు తీసుకుంటా. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అకడమిక్, రీసెర్చ్ యాక్టివిటీలను పటిష్టం చేసేందుకు తగిన కార్యాచరణ రూపొందిస్తా. పరిపాలనాపరమైన మార్పులకు సంబంధించి కచ్చితమైన అవగాహన వచ్చాక అందుకనుగుణంగా ముందుకెళతా.

■ ఆన్సర్ బుక్స్ ఆన్‌లైన్ వెరిఫికేషన్‌లో అక్రమాలు ?

■ ఆన్సర్ బుక్స్ ఆన్‌లైన్ వెరిఫికేషన్ అక్రమాలపై పకడ్బందీగా వ్యవహరిస్తా. ఒక్కో స్క్రిప్ట్‌కు రూ.12లకు ఇవ్వడం సబబు. అంతకంటే ఎక్కువ ఇవ్వడమంటే లెక్క తప్పినట్లే. ఇందుకు సంబంధించి కేవలం రెండు కొటేషన్లు మాత్రమే వచ్చాయి. కనీసం మూడు కొటేషన్లు వస్తేనే ముందుకెళతాం. అయితే రూ.12 లకే చేస్తామంటే మాత్రం వెంటనే అప్పగిస్తాం.

■ వివాదాస్పద 2014 నియామకాల ప్రమోషన్ల వివాదంపై..?

■ 2014 వివాదాస్పద నియామకాల విషయం ప్రస్తుతం కోర్టులో ఉంది. కోర్టు నుంచి వచ్చే తీర్పు మేరకు, ఆ తరువాత ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ వచ్చే వరకు ఈ విషయంపై తగిన విధంగా ముందుకు వెళతాం. ఇంతకు మించి ఎలాంటి ఇతరత్రా వ్యవహారాలు ఉండవు.

■ బాలికల వసతి గృహాల కొరతపై..?

■ యూనివర్సిటీలో బాలికల వసతి గృహాల సమస్య ఉంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రూ.7 కోట్ల 'రూసా' నిధులతో వసతిగృహాలు నిర్మిస్తాం. ఇందుకు సంబంధించి టెండర్లు పిలుస్తాం

■ అవకతవకలు, అక్రమాల నేపథ్యంలో గత పాలకమండలి తీర్మానాల అమలు విషయమై, మాజీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్లు కనకయ్య, విద్యావర్ధినిలపై చర్యలు తీసుకోవాలనే సిఫార్సులపై..?

■ వర్సిటీలో అక్రమాలు, అవకతవకల విషయమై ఇప్పటికే ఏసీబీ, విజిలెన్స్ విచారణ నడుస్తోంది. కాగా కీలక అంశాలు, వ్యవహారాలపై గత పాలకమండలి తీసుకున్న నిర్ణయాలు, అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యల గురించి సిఫారసు చేసిన చర్యల విషయమై ప్రతి అంశాన్ని పరిశీలించి తగినవిధంగా ముందుకెళతా. కచ్చితమైన చర్యలు ఉంటాయి.

పరేషాన్‌లో పత్తి రైతు

- అకాల వర్షాలతో దెబ్బతిన్న పంట
- తగ్గిన దిగుబడులు
- పెట్టుబడులూ తిరిగొచ్చేలా లేవంటున్న రైతులు



■ ఈ రైతు పేరు ఏనుగు చిన్నబాల్‌రెడ్డి. సదాశివనగర్ గ్రామానికి చెందిన ఈయన.. 15 ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. అయితే ఈసారి వర్షాలతో పంట దెబ్బతింది. దీంతో పంట సరిగా ఎదగలేదు. పూత, కాత సమయాల్లో వర్షం కురియడంతో పంట తీవ్రంగా దెబ్బతింది. దీంతో ఎకరానికి నాలుగైదు క్వింటాళ్ల దిగుబడి కూడా రావడం కష్టమేనని రైతు పేర్కొంటున్నారు. పంట సాగుకు ఎకరానికి రూ. 20 వేల వరకు ఖర్చు చేశానని, పెట్టుబడులు కూడా తిరిగివచ్చేలా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

సదాశివనగర్ : జిల్లాలో 33,657 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. సదాశివనగర్ మండలంలో సదాశివనగర్‌తో పాటు తిర్మన్‌పల్లి, మర్కల్, ధర్మారావ్ పేట్, అమర్లబండ, తుక్కోజీవాడి, తిమ్మోజీవాడి, కల్వరాల్ గ్రామాల శివారు భూముల్లో ఎక్కువగా పత్తి సాగయ్యింది. ఈ సీజన్‌లో కురిసిన భారీ వర్షాలు పత్తి పంటపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. పత్తి ఎదిగేటప్పుడు, పూత, కాత దశల్లో అకాల వర్షాలు కురియడంతో పంట దెబ్బతింది. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఎకరానికి 10 నుంచి 14 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వచ్చేదని రైతులు పేర్కొంటున్నారు. కానీ ఈ సీజన్‌లో పంట సరిగా ఎదగకపోవడంతో ఎకరానికి నాలుగైదు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాలు లేక..

ప్రభుత్వం పత్తిని సీసీఐ కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తుంది. గతేడాది ఏ గ్రేడ్ పత్తికి రూ. 7,521, బీ గ్రేడ్ పత్తికి రూ. 7,121 ధర చెల్లించింది. అయితే కామారెడ్డి ప్రాంతంలో పత్తి కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించక తప్పని పరిస్థితి నెలకొంది. దీంతో వారు చెప్పిన ధరకే పంటను అమ్ముకోవాల్సి వచ్చింది. ఈసారీ అదే పరిస్థితి ఉందని రైతులు అంటున్నారు. ఇప్పటికే దళారులు వచ్చి మొదటి విడత తీసిన పత్తిని కొనుగోలు చేస్తున్నారని పేర్కొంటున్నారు. వారు క్వింటాలుకు రూ. 5,500 చెల్లిస్తున్నారని, పంటను నిల్వ చేసుకోవడానికి సరిపడా స్థలం లేనందున వారు చెప్పిన ధరకే పంటను అమ్ముకుంటున్నామని పలువురు రైతులు తెలిపారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కూలీల కొరత తీవ్రంగా ఉంది



అకాల వర్షాలతో పత్తి పంట దెబ్బతింది. ఉన్న పంటను తీద్దామంటే కూలీల కొరత వేధిస్తోంది. ఎకరానికి నాలుగు క్వింటాళ్లు కూడా వచ్చేలా లేదు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా నష్టపోతున్నాం..

- ముదుపు బాల్‌రెడ్డి, తిర్మన్‌పల్లి

దళారులకే అమ్మాల్సి వస్తోంది..



మూడెకరాల్లో పత్తి వేసిన. అయితే వానలతో పంటకు నష్టం జరిగింది. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో తప్పక దళారులకు అమ్ముకోవాల్సి వస్తుంది. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

- పైడి గోపాల్‌రెడ్డి, పత్తి రైతు, తిర్మన్‌పల్లి

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

కామారెడ్డి టౌన్: పంచాయతీరాజ్ శాఖలో విధులు నిర్వహిస్తున్న తమకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలను చెల్లించాలని కోరుతూ ఆపరేటర్లు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రజాపాలన డాటా ఎంట్రీ నిధులు మంజూరు చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధుల్లో 10 శాతం నిధులు ఈ పంచాయతీ ఖాతాకు జమ చేయాలని ఆదేశాలున్నా కొన్ని జీపీలు జమ చేయడం లేదని తెలిపారు. తమకు న్యాయం చేయా లని కోరారు. కార్యక్రమంలో ఈ–పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సందీప్, ప్రధాన కార్యదర్శి సంధ్య, ప్రతినిధులు అనిల్, కొండారెడ్డి, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు

అరుణాచలంకు బస్సు సౌకర్యం

బోధన్: కార్తీక పౌర్ణమి రోజున అరుణాచల గిరి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం బోధన్ నుంచి సూపర్ లగ్జరీ బస్సు నడపనున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. నవంబర్ 13న సాయంత్రం 3 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. 14న రాత్రి అరుణాచలం చేరుకుని, మరుసటి రోజు అక్కడి నుంచి బయలుదేరి 16న సాయంత్రం బోధన్‌కు చేరుకుంటుందని తెలిపారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



నిజాంసాగర్: జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. బిచ్కుంద ఐటీఐ కళాశాలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేసినందుకు ధన్యవాదాలు తెలిపానని ఎమ్మెల్యే తెలిపారు. లెండి ప్రాజెక్టు, నాగమడుగు ఎత్తిపోతల పథకాలను త్వరగా పూర్తి చేయాలని, జుక్కల్ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేయాలని కోరానని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే కారును ఢీకొట్టిన లారీ



సదాశివనగర్: మండలంలోని పద్మాజివాడి చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కారును వెనుక నుంచి లారీ ఢీకొంది. ఎమ్మెల్యే హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తుండగా స్పీడ్ బ్రేకర్ వద్ద కారు డ్రైవర్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుక నుంచి వచ్చిన లారీ కారును ఢీకొట్టింది. ప్రమాదంలో కారు అద్దం పగిలింది. ఎమ్మెల్యేకు ఎలాంటి గాయాలు కాలేదు.

శాసనమండలి చైర్మన్‌కు రికార్డ్ అసిస్టెంట్ల వినతి



మోపాల్: తమకు జూనియర్ రెవెన్యూ అధికారిగా అవకాశం కల్పించాలని తహసీల్దార్ కార్యాలయాల్లోని రికార్డ్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు శుక్రవారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్‌ను కలిసి విన్నవించారు. జీఆర్‌వోలుగా అవకాశం కల్పిస్తూనే సొంత జిల్లాలకు పంపించాలని రికార్డ్ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి వీరన్న కోరారు. నాయకులు సాయినాథ్, పృథ్వీరాజ్, సంతోష్, సాయన్న ఉన్నారు.

సాలూర చెక్‌పోస్ట్ వద్ద రూ.లక్ష సీజ్

బోధన్‌రూరల్: మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో సాలూరలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం రూ.లక్ష సీజ్ చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. మహారాష్ట్రకు చెందిన ధన్‌రాజ్ రూ.లక్ష నగదు తీసుకొని బోధన్ వైపు వస్తుండగా సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

లక్కీ కాయిన్ నిర్వాహకుల అరెస్ట్

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ వద్ద శుక్రవారం లక్కీ కాయిన్ ఆట నిర్వహిస్తున్న వారిని అరెస్టు చేశారు. పెర్కిట్‌కు చెందిన సుంకరి వెంకన్న, ఆర్మూర్‌కు చెందిన షేక్ దావుద్‌లను మెండోరా ఎస్సై నారాయణ అరెస్ట్ చేశారు. పోచంపాడ్‌లో లక్కీ కాయిన్ ఆటపై ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించి కాపు కాసి వారిని పట్టుకున్నారు.

పనులు పూర్తి చేయాలి

- వీసీ యాదగిరిరావు
- క్యాంపస్‌లోని పలు భవనాల సందర్శన

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్ ఆవరణలోని సైన్స్ కాలేజీ భవనం పనులను నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని వీసీ టి యాదగిరిరావు సూచించారు. శుక్రవారం నిర్మాణంలో ఉన్న సైన్స్ కాలేజీ పనులను రిజిస్ట్రార్ యాదగిరితో కలిసి వీసీ పరిశీలించారు. ల్యాబ్‌లు, తరగతి గదులకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం న్యాయ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌ను వీసీ సందర్శించారు. వర్సిటీ విద్యార్థులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థినులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. వసతి గృహంలోని బాలికలకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. హాస్టల్ చుట్టుపక్కల పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించాలని హాస్టల్ వార్డెన్ కిరణ్మయి, చీఫ్ వార్డెన్ మహేందర్‌ను ఆదేశించారు.

చదువుతో పాటు క్రీడలు అవసరమే..

విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమేనని తెలంగాణ యూనివర్సిటీ వీసీ యాదగిరిరావు అన్నారు. శుక్రవారం క్యాంపస్ క్రీడామైదానంలో తెయూ ఇంటర్ కాలేజీ బ్యాడ్మింటన్ (మెన్) సెలెక్షన్స్ నిర్వహించారు. వర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల నుంచి 30 మంది



తెయూ గర్ల్స్ హాస్టల్‌ను పరిశీలిస్తున్న వీసీ యాదగిరిరావు

క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన ఐదుగురిని ఎంపిక చేసినట్లు వర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్‌బాలకృష్ణ తెలిపారు. వీరు ఈ నెల 26 నుంచి 29వరకు చెన్నైలో జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్ బీఆర్ నేత తెలిపారు.

ఎంపికైన క్రీడాకారులు

నికేష్, ఉమేష్ (గిరిరాజ్ డిగ్రీ కాలేజీ), అనిల్, సాయికుమార్ (తెలంగాణ యూనివర్సిటీ), రోహన్ (గిరిజన సంక్షేమ డిగ్రీ కాలేజీ, కామారెడ్డి).

కష్టపడితే బంగారు భవిష్యత్తు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ

తెయూ(డిచ్‌పల్లి)/భిక్కనూరు: విద్యార్థులు కష్టపడితే బంగారు భవిష్యత్ ఉంటుందని తెయూ వీసీ యాదగిరిరావు అన్నారు. తెయూ సౌత్‌క్యాంపస్ జువాలజీ విభాగం మొదటి బ్యాచ్ విద్యార్థులు ముగ్గురు హాల్స్ లైఫ్ సైన్సెస్ కంపెనీలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన డి సరిత, ఎం అవినాష్, అజయ్‌గౌడ్‌కు శుక్రవారం వీసీ, రిజిస్ట్రార్ యాదగిరి ఆర్డర్ కాపీలను అందజేశారు. జువాలజీ హెచ్‌వోడీ ప్రసన్న శ్రీల, సౌత్ క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, అధ్యాపకులు సునీల్ కుమార్, విజయ్ కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి



కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : విద్యార్థులకు నాణ్యమైన విద్యానందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలను సందర్శించారు. రాశివనంలో మొక్క నాటారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులనుంచి గౌరవ వందనం స్వీకరించారు. కళాశాలలోని కంప్యూటర్, ఫొరెన్సీ ల్యాబ్‌లను పరిశీలించారు. ప్రిన్సిపాల్ విజయ్ కుమార్‌తో మాట్లాడి విద్యార్థుల సంఖ్య, హాజరు, బోధన అంశాల గురించి తెలుసుకున్నారు. కళాశాలలో పడి ఉన్న పనికి రాని వస్తువులు, చెత్తను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్ రావు, తహసీల్దార్ జనార్దన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ సర్వేను వేగవంతం చేయాలి

కామారెడ్డి క్రైం: ఎల్‌ఆర్‌ఎస్ సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్ వార్డ్ నంబర్ 1లో పర్యటించి, ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ, మున్సిపల్, నీటి పారుదల శాఖ అధికారులు సంయుక్తంగా భూములను పరిశీలించాలని సూచించారు. వివరాలను సర్వే యాప్‌లో పొందుపరచాలన్నారు. ఎప్పటికప్పుడు నివేదికలను అప్‌డేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథ్‌రావు, మున్సిపల్ కమిషనర్ సుజాత, తహసీల్దార్ జనార్దన్, మున్సిపల్, రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎల్‌ఆర్‌ఎస్ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సంక్షిప్తం

రుణాలు మంజూరు చేయాలి

కామారెడ్డి టౌన్: బీసీ కుల వృత్తిదారులకు రుణాలు మంజూరు చేయాలని చేతి వృత్తిదారులు సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శివరాం, విఠల్, రాజయ్య, లక్ష్మణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో నూతన కోర్సులు ప్రారంభం

కామారెడ్డి టౌన్: జిల్లాలోని బిచ్కుంద ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ, ఆధునిక సాంకేతిక కేంద్రంలో నూతనంగా ఆరు కోర్సులను ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రుణమాఫీ కాని రైతుల వివరాలు ఇవ్వాలి

దోమకొండ: మండలంలోని కెనెరా బ్యాంకు పరిధిలో రుణమాఫీ కాని రైతుల వివరాలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రానికి చెందిన యువసేన 97 అసోసియేషన్ సభ్యులు బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశబూరు. సమాచార హక్కు చట్టం ప్రకారం గత మూడు విడతల్లో రుణమాఫీ కానీ రైతుల వివరాలు ఇవ్వాలని కోరినట్లు యువసేన అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మెర రాజేందర్ పేర్కొన్నారు. ఆయన వెంట సంఘం ప్రతినిధులు చాట్ల ప్రసాద్, పుల్గం నర్సింలు, కుమ్మరి స్వామి తదితరులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

పిట్లం: మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆస్పత్రి నేత్ర వైద్య సహాయాధికారి హరికిషన్‌రావు తెలిపారు. అవసరమైన వారికి ఆపరేషన్ నిమిత్తం బాన్సువాడకు పంపిస్తామన్నారు. మండలంలోని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

పిట్లంలో ఫిజియోథెరపీ..

పిట్లం: మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో వికలాంగ విద్యార్థుల కోసం శుక్రవారం ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు. ఫిజియోథెరపిస్ట్ వి సారిక వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చేపట్టారు. ఇంటి వద్ద చేయించే వ్యాయామాలపై తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కమల్ కిశోర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

భూంపల్లిని సందర్శించిన జెడ్పీ సీఈవో

సదాశివనగర్: మండలంలోని భూంపల్లి గ్రామాన్ని జెడ్పీ సీఈవో చందర్ నాయక్ శుక్రవారం సందర్శించారు. శానిటేషన్, పల్లె దవాఖాన, ఉన్నత పాఠశాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో సురేందర్ రెడ్డి, ఏపీఎం రాజిరెడ్డి, ఏపీవో శ్రీనివాస్, ఈసీ మధు జీపీ కార్యదర్శి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

కామారెడ్డి టౌన్: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 'రక్తదానం ఆవశ్యకత-తలసేమియ వ్యాధిగ్రస్తుల అవగాహన' కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. రక్తదానంతో తలసేమియతో బాధపడే చిన్నారులకు కొత్త జీవితాన్ని ప్రసాదించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, జిల్లా రక్తదాన సమన్వయకర్త బాలు, వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌కు తరలిన కార్మికులు

బాన్సువాడ: బాన్సువాడ మున్సిపల్ కార్మికులు శుక్రవారం హైదరాబాద్‌లో చేపట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఖలీల్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఎండీఏ కార్యాలయ ముట్టడికి తరలివెళ్లినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌కు తరలిన వారిలో కార్మికులు బుజ్జిగారి సాయిలు, మేతారి రాజు, శివరాజులు, రాజేశ్, ముక్కగళ్ల సాయిలు తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి

ఎల్లారెడ్డిరూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు మున్సిపల్ మాజీ చైర్మన్, కౌన్సిలర్ కుడుముల సత్యనారాయణ సూచించారు. శుక్రవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో వెల్లుట్ల గ్రామ కాంగ్రెస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్ గెలుపొందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



బాన్సువాడ: ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆనందం అన్నారు. శుక్రవారం బాన్సువాడలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో పద్మారావు, కౌసర్, నారాయణ, శంకర్, ఫరీద్, యేసయ్య, పండరి, మహమూద్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చొరవతోనే కొత్త పంచాయతీలు

- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్: బీఆర్ఎస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు చొరవతోనే కొత్త పంచాయతీలు ఏర్పడ్డాయని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకవచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని చెప్పారు. శుక్రవారం భీమ్‌గల్, ఏర్గట్ల మండలాల్లోని పలు గ్రామాల్లో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనాలను ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గిరిజనుల కలను సాకారం చేయడానికి భీమ్‌గల్‌లో రూ.50 లక్షలతో బంజారా భవనం నిర్మించామన్నారు. ఆ భవనం ప్రహరీ నిర్మాణానికి సీడీపీ నిధుల నుంచి రూ.17లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.

జాతరకు ఆహ్వానం

లింబాద్రి గుట్ట శ్రీలక్ష్మి నర్సింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిని పురోహితులు ఆహ్వానించారు. శుక్రవారం ఆయనకు ఆహ్వాన పత్రిక అందించారు. భీమ్‌గల్, ఏర్గట్ల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గోకుల్‌తండా-2ను జీపీగా మార్చాలి



రామారెడ్డి: జనాభను దృష్టిలో పెట్టుకుని గోకుల్‌తండా-2ను జీపీగా ఏర్పాటు చేయాలని కోరుతూ తండావాసులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావును హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడుతూ.. తండా జీపీ చేయాలని ఎమ్మెల్యేను కోరితే సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గీరెడ్డి మహేందర్ రెడ్డి, శిలాసాగర్, షేక్ ఇర్ఫాన్, నరేందర్, బాలరాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బీమా చెక్కు పంపిణీ



నిజాంసాగర్: మండలంలోని నర్సింగ్‌రామ్‌పల్లి గ్రామానికి నంగి మంజులకు శుక్రవారం తెలంగాణ భవన్‌లో రూ. 2 లక్షల బీఆర్ఎస్ సభ్యత్వ బీమా చెక్కును అందజేశారు. నంగి మంజుల భర్త ప్రభాకర్ మూడు నెలల క్రితం ప్రమాదవశత్తు చెరువులో పడి మృతి చెందాడు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం కలిగి ఉండటంతో పార్టీ ప్రమాదబీమా కింద రూ. 2 లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో నర్సింగ్‌రామ్‌పల్లి మాజీ సర్పంచ్ సుబ్బురి సాయిలు తదితరులు ఉన్నారు.

వేర్వేరు కారణాలతో పలువురి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: రైలు కింద పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డిలోని ఆర్‌బీనగర్ కాలనీ సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు.. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని రైలుకు ఎదుగా వెళ్లి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కామారెడ్డి రైల్వే ఎస్సై తావూనాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఎడమ చేతిపై పచ్చబొట్టుతో ఆర్‌ఆర్ పటేల్ అని రాసి ఉంది. మృతుడి వయస్సు 35–40 ఏళ్ల మధ్య ఉంటుందని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

మతిస్థిమితం లేని మహిళ..

రాజంపేట: మతి స్థిమితం లేని మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజంపేట మండలం కొండాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన నీరడి చంద్రవ్వ(50)కు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతోంది. మతిస్థిమితం కూడా లేదు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఆమె తన తల్లిగారింటికి లింగాయిపల్లె వెళ్తానని చెప్పింది. ఆమె ఆరోగ్యం బాగా లేక పోవడంతో భర్త కిష్టయ్య వద్దన్నాడు. దీంతో అదే రాత్రి ఇంట్లో సమాచారం ఇవ్వకుండా చంద్రవ్వ ఇంటి నుంచి వెళ్లిపోయింది. లింగాయిపల్లె వెళ్లిందేమోనని అక్కడ వాకబు చేయగా రాలేదన్నారు. రెండు రోజులుగా గాలించగా గ్రామ పరిధిలోని మామిడి చెరువులో శుక్రవారం ఉదయం మృతదేహం తేలింది. కాగా మతిస్థిమితం లేక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.



చంద్రవ్వ(ఫైల్)

మనస్తాపంతో వృద్ధుడు..



నందిపేట్: నందిపేట మండలం ఉమ్మెడ శివారులో గల గోదావరి నదిలో దూకి ఆలూరుకు చెందిన కండెల నర్సయ్య(78) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాలు.. ఆలూరు గ్రామానికి చెందిన నర్సయ్య కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులకు భారం అవుతున్నానని మనస్తాపం చెందాడు. శుక్రవారం మధ్యాహ్నం ఉమ్మెడ గోదావరి బ్రిడ్జి పైనుంచి నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడు..



శ్రీనివాస్(ఫైల్)

రాజంపేట: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజంపేట మండలంలోని షేర్‌శంకర్ తండాలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. తండాకు చెందిన కాట్రోత్ శ్రీనివాస్ (26) శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

మద్యం మత్తులో మేస్త్రీ..

ఇందల్వాయి: మద్యం మత్తులో మేస్త్రీ బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా తిమ్మారెడ్డి పల్లె గ్రామానికి చెందిన అబ్దుల్ జిలాని బతుకు దెరువు కోసం ఇందల్వాయి మండలం గన్నారం గ్రామానికి వలస వచ్చాడు. ఇక్కడ మేస్త్రీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో తాను పనిచేస్తున్న ఇంట్లోనే శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మనోజ్ కుమార్ తెలిపారు. మద్యం మత్తులో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు చెప్పారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిద్రలో కరెంట్ షాక్ : యువకుడి మృతి



సదాశివనగర్: చార్జింగ్ పెట్టిన కరెంట్ వైర్ తగిలి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన సదాశివనగర్ మండలం యాచారం తండాలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. తండాకు చెందిన మాలోత్ అనిల్(23) గురువారం పడుకునే ముందు ఫోన్ చార్జింగ్ పెడదామనుకున్నాడు. సాకెట్ దూరం ఉండటంతో ఎక్స్‌టెన్సన్ బాక్స్ మంచం వద్ద పెట్టుకొని చార్జింగ్ పెట్టాడు. అయితే రాత్రి నిద్రలో ఆ బాక్స్‌పై కాలు పడటంతో షాక్ కొట్టి చనిపోయినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

విద్యుత్ తీగలు తగిలి హార్వెస్టర్ డ్రైవర్..

ఎల్లారెడ్డి: పొలం వద్ద విద్యుత్ తీగలు తాకడంతో షాక్ కొట్టి హార్వెస్టర్ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన ఎల్లారెడ్డి మండలం ఆజామాబాద్ గ్రామంలో గురువారం చోటు చేసుకున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన యువరాజ్ (40) పొలాలు కోయడానికి హార్వెస్టర్ తీసుకొని ఇక్కడకు వచ్చాడు. ఈ క్రమంలో హార్వెస్టర్ నడుపుకుంటూ వెళ్తున్న సమయంలో ఆజామాబాద్ శివారులోని థావుర్యా నాయక్ పొలం వద్ద విద్యుత్ తీగలు తగలడంతో మృతి చెందాడు.

పాముకాటుతో ఇంటర్ విద్యార్థి..



నాగిరెడ్డిపేట: ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాము కాటు వేయడంతో ఇంటర్ విద్యార్థి మృతి చెందిన ఘటన నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పోసానిగారి శ్యాంరావు, అనసూజ దంపతులు ఇద్దరు కుమారులతో కలిసి గురువారం రాత్రి ఇంట్లో నిద్రించారు. పాము ఇంట్లోకి ప్రవేశించి చిన్న కుమారుడు కృష్ణ(17)ను కాటు వేసింది. కొద్ది సేపటికి తనను ఏదో కరిచినట్లుందని కృష్ణ ఇంట్లో వారిని నిద్రలేపి చెప్పాడు. దీంతో తల్లిదండ్రులు వెంటనే చికిత్స నిమిత్తం నాగిరెడ్డిపేట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి మెదక్ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కృష్ణ ప్రస్తుతం గోపాల్‌పేటలోని సిద్ధార్థ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు.